# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

# రేడియో శ్రీలంకద్వారా క్రీస్తు సంఘముల
# కార్యక్రమములు

---

| | |
|---|---|
| తెలుగు | : సత్యవాణి (The Voice of Truth)<br>ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో<br>మధ్యాహ్నం 2-15 గంటలకు. |
| తమిళం | : సత్యవాణి (The Way of Truth)<br>మంగళవారం - 5-30 p.m.<br>గురువారం, ఆదివారం - 6-45 p.m. |
| మలయాళం | : The Voice of Truth<br>మంగళ, శుక్రవారాలు 3-45 p.m. |
| కన్నడ | : The Voice of Truth<br>ఆదివారం - 1-45 p m. |
| హిందీ | : సత్యసుసమాచార్<br>మంగళ, గురు, శుక్రవారాలు 9-00 p.m.<br>ఆదివారం - 12-45 to 1-00 p.m. |
| ఇంగ్లీషు | : The Voice of Truth<br>సోమవారం - 9-00 p.m.<br>శుక్రవారం - 7-45 p.m. |

---

**ఈ కార్యక్రమాలను అందరు వినండి. అందరికీ విన్పించండి.**

---

Razan Electric Press, Kakinada-1.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

**Editor :** J.C. CHOATE

**Managing Editor :** JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి **10** ఫిబ్రవరి **1990** సంచిక **7**


## సంపాదకీయము

### కొందరు ప్రభువునకు ఎందుకు లోబడలేదు

### ( Why some do not obey the Lord )

ప్రపంచము పాపమందు నశించుచున్నది. దీని అర్ధ మేమనగా అనేకమంది దేవుడు, నిరీక్షణ లేకుండ తమ జీవితాలను కొనసాగించుచున్నారు. పిల్లలు బాధ్యతాయుతమైన స్థితికి ఎదుగుటలేదు, లేదా మంచి యేదో, చెడుయేదో, సురక్షితమైన స్థానమేదో గ్రహించలేక పోవుచున్నారు. జనాభాలో కొద్ది శాతము ప్రజలు మాత్రమే దేవునికి లోబడి ఆయన విశ్వాసంలో నిలిచియుండడానికి ప్రయత్నించుచున్నారు. ప్రపంచములో మిగిలిన వారందరు తమ పాపములద్వారా ఆత్మీయముగా చనిపోవుచున్నారు.

కాని ఈ స్థితి ఈ విధంగానే ఉండనవసరంలేదు. పాపములో ఉన్నవారందరు రక్షింపబడుట సాధ్యము. క్రీస్తు సిలువపై మరణించుట ద్వారా రక్షణను సాధ్యపరచెను (రోమా 5 : 8). అయినప్పటికిని చాలామంది పాపములోను నిరాశలోను కొనసాగుచున్నారు. ఎందు

వలన? వారికి జ్ఞానయుక్తమైన ఆలోచనాధోరణి లేదు. కొందరు క్షమాపణ చెప్పేవారుగానే యున్నారు.

## మంచితనము మాత్రమే సరిపోదు

చాలామంది మేము మంచివారమని, మేము నైతికంగా మంచి జీవితాన్ని జీవించుచున్నామని, ఎప్పుడూ మంచిపని చేయడానికే ప్రయత్నించుచున్నామని, మేము చేయుచున్న పని మంచిదని వారు అభిప్రాయపడుచున్నారు. ప్రభువుకు దూరంగా ఉండి తమ్మును తాము రక్షించుకొనలేరని వారు గ్రహించలేకున్నారు. ఒకడు జన్మ పాపి కాడు. తలిదండ్రుల పాపము లేదా పితరుల పాపము ఒకనిపై నుండదు. మంచిచెడులు తెలిసికొను వయస్సు అతనికి వచ్చేటప్పటికి అతడు పాపియై రక్షకునియొక్క అవసరత కలిగియుండును. అపొస్తలుల కార్యములు 10, 11 అధ్యాయాలలో కొర్నేలీ అతని యింటివారు ఎంతటి మంచివారో మీకు జ్ఞాపకము చేయుచున్నాము. అయినప్పటికి వారు నశించిన స్థితిలోనే ఉండుటవలన పేతురు, ఇతరులు వెళ్లి వారికి సువార్త ప్రకటించి విధేయులగునట్లు వారికి బోధించిరి. వారు సత్యమును నేర్చుకొని విధేయులై రక్షింపబడిరి. దీనికి ముందు వారి మంచితనము వారి ప్రార్థనలు వారిని రక్షించలేదు. మంచి జీవితము జీవించాలని హెచ్చరింపబడినప్పటికి అది రక్షించలేదు, పరలోకానికి తీసికొని వెళ్ళలేదు.

మత సంబంధమైన చాలామంది నశించిపోవుచున్నారు. దానికి కారణ మేమనగా వారు ప్రభువుకు విధేయులు కావడంలేదు. పరిసయ్యులవలె సద్దూకయ్యులవలె సౌలువలె యింకా యితరులవలె వారు ఏదో ఒక సంఘానికి సభ్యులు. లేదా మతసంబంధమైనవారు. వారు ఆరాధించవచ్చును. యితరులకు బోధించుటలో నాయకత్వము కలిగియుండవచ్చును. వారు మోసగింపబడి నశించిపోవుచున్నారు. పరిసయ్యులు, సద్దూకయ్యులు మతసంబంధమైన ఆసక్తిగలవారు కాని వారు

మనుష్యులు కల్పించిన పద్ధతుల ననుసరించి ఆరాధించుచున్నారని వారిని గద్దించెను (మార్కు 7:7). సౌలు మార్పు చెందిన తరువాత ఆతడు తన గతాన్ని గురించి ఈలాగు తెలియజేసెను. "నజరేయుడైన యేసు నామమునకు విరోధముగా అనేక కార్యములు చేయవలెనని నేననుకొంటిని" (అపొ. కా. 26 : 9). ఈ దినాల్లో మేము క్రీస్తును వెంబడించుచున్నామని చెప్పుకొను చాలామంది మానవ కల్పిత సంఘాలలో ఉండి, మనుష్య నామములు ధరించి, క్రీస్తు బోధకు వ్యతిరేకముగా నున్న సంగతులను బోధించి వాటిని ఆచరించుచున్నారు. వీరికి సత్యము ప్రకటించుట కష్టము. ఎందుకనగా వారు ఎప్పుడో రక్షింపబడితిమని తలంచుచున్నారు. ఈ రకపు ప్రజలు లేఖనముల యొద్దకు వెళ్ళి వానిని చదివి గ్రహించి దేవుని దృష్టిలోను వారి దృష్టిలోను నమ్మకముగా నుండవలసి యున్నది. మనుష్యులు బోధించే విషయాలను లేదా నీవు నమ్మిన విషయాలను మరచిపోవలెను. రక్షణను గూర్చి, సంఘమును గూర్చి, ఆరాధనను గూర్చి బైబిలు ఏమి చెప్పుచున్నదో గ్రహించి నీవు ప్రస్తుతము నమ్మి జరిగించుచున్న పద్ధతులను బైబిలు బోధించు విషయాలలో సరిచూచుకొనుము. నీకు మార్పు అవసరమైతే అలాగు చేయుము. నీవు తప్పుబోధలో ఉన్నట్లయితే సరిదిద్దుకొనుము, రక్షింపబడుము, వాటికి వ్యతిరేకముగా నిలువబడుము.

## ఎంత పాపినైనను రక్షించును

కొందరు తమ పాపులు, దుష్క్రియలు ఎక్కువగా జరిగించిన కొందరు తమ పాపులు, దుష్క్రియలు ఎక్కువగా జరిగించినందున క్షమాపణ లేదని భావించుచున్నారు. ఇలాంటి అభిప్రాయాన్ని నీవు కలిగి యున్నట్లయితే దయచేసి పెంతెకొస్తు దినాన అపొస్తలులు ప్రకటించిన సువార్త విని ప్రభువుకు విధేయులైనవారిని చూడండి. వారిలో కొందరు ప్రభువు సిలువ మరణమునందు పాల్గొనిరి. వారికి బోధించుచు వారిని మార్చడానికి, వారు ప్రభువుకు విధే

యత చూపవలసిన అవసరాన్ని వారిలో నెలకొల్పడానికి పేతురు మరియు అపొస్తలులు వారితో యిట్లు చెప్పారు. "ఇశ్రాయేలు వారలారా, యీ మాటలు వినుడి. దేవుడు నజరేయుడగు యేసుచేత అద్భుతములును మహత్కార్యములను సూచక క్రియలను మీ మధ్యను చేయించి, ఆయనను తనవలన మెప్పు పొందినవానిగా మీకు కనబరచెను; ఇవి మీరే ఎరుగుదురు. దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యత్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన యీయనను మీరు దుష్టులచేత సిలువ వేయించి చంపితిరి. మరణము ఆయనను బంధించి యుంచుట అసాధ్యము గనుక దేవుడు మరణవేదనలు తొలగించి ఆయనను లేపెను" (అపొ. కా. 2 : 22-24). దేవుని కుమారుని వధించి ఆయనను సిలువ వేసిన వారితో హస్తములు కలిపిన వారి నుద్దేశించి మాటలాడిన ఈ మాటలు గమనించండి. మనమింకా చదివినట్లయితే వారు ఈ మాటవిని హృదయములో నొచ్చుకొని మేమేమి చేతుమని అడిగిరి. వారు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది, పరిశుద్ధాత్మ అను వరము పొంది, సంఘమునకు చేర్చబడిరి. వారి పాపమునుబట్టి వారు తిరస్కరింపబడిరా? లేదు వారు ప్రభువును నమ్మి ఆయనకు లోబడినట్లయితే తప్పని సరిగ రక్షింపబడుదురు. క్రీస్తును సిలువ వేసిన వారు రక్షింపబడిరి. ఈ రోజులలో ఎవరైతే ప్రభువువైపునకు తిరిగి ఆయన బోధలకు విధేయత చూపుదురో వారు రక్షింపబడుదురు. పాపములోనుండి మానవుని రక్షించుటకు క్రీస్తు మరణించాడను విషయం మనము జ్ఞాపకముంచుకొనవలసి యున్నది. మనం తెలిసికొనదగిన మరియొక వ్యక్తి పౌలు. అతడు ప్రభువును వ్యతిరేకించి ఆయన సంఘాన్ని హింసించెను. ప్రభువు అతనికి ప్రత్యక్ష మయ్యెను (అపొ. కా. 9). పౌలు యిట్లు పలికెను. "ప్రభువా నేనేమి చేయవలెను?" తరువాత అతనికి ఏమి చేయవలెనో చెప్పబడెను. అతడు సువార్తకు విధేయుడై

అతని పాపములు కడిగివేసికొనెను (అపో. కా. 22 : 16). తరువాత పాపులలో నేను ప్రధానుడనని అతడు చెప్పెను. అతడు చేసిన వాటినన్నిటిని ప్రభువు క్షమించెనని చెప్పెను. పౌలు చెప్పిన మాటలు వినండి. "పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై యున్నది. అట్టి వారిలో నేను ప్రధానుడను. అయినను నిత్యజీవము నిమిత్తము తనను విశ్వసింప బోవువారికి నేను మాదిరిగా ఉండులాగున యేసుక్రీస్తు తన పూర్ణమైన దీర్ఘశాంతమును ఆ ప్రధాన పాపినైన నాయందు కనుపరచునట్లు నేను కనికరింపబడితిని" (1తిమో 1; 15-16). లేదు స్నేహితుడా, నీవు చేసినది ప్రభువు నిన్ను క్షమించలేనంత గొప్ప పాపము కాదు. నీవు చేయవలసిన దంతా దేవునివైపునకు తిరిగి నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, విధేయుడవైనప్పుడు, ఆయన నీ పాపములన్నిటిని క్షమించును. నీ అపనమ్మకము, మారుమనస్సు పొందని హృదయమే నీవు నశించడానికి కారణము.

## విధేయులు కావాలి

దేవుని యొక్క సత్యాన్ని ఎరిగిన వారు చాలా మంది ఉన్నారు. వారు విధేయత చూపవలసిన అవసరమున్నది. కాని వారు నిర్లక్ష్యం చేయుచున్నారు. నీవు ఇట్టివారి జాబితాలో ఉన్నట్లయితే నీ రక్షణ విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని కోరుచున్నాము. నీవు ఆయన చిత్తమునకు విధేయుడవు కాని యెడల ప్రభువు నిన్ను రక్షించలేడు, రక్షించడు. చేయతగినది నీవు ఎరిగియుండి కూడ ఆలాగు చేయకపోవుట జీవితంలో ఎంత సిగ్గుకరము. సత్యము ఎరుగని వారితోను క్రీస్తు రక్తముతో సంబంధములేకుండ మంచి వారమని చెప్పుకొనే వారితోను ఆఖరిదినాన కలిసి నీవుంటావు. కనుక నీవు వెంటనే లేచి ప్రభువుకు విధేయుడ

వగుటకు నీకు సమయము తరుణము ఉన్నది. అపొస్తలుల కార్యములు 8లో చెప్పబడిన ఐతియోపీయుని వలె నుండుము. దేవుని చిత్తము విన్నవెంటనే "బాప్తిస్మ మిచ్చుటకు నాకు ఆటంక మేమి?" అని అడుగుము. నీవు విధేయుడవైన వెంటనే అతనివలె నీవును సంతోషించుచు త్రోవను వెళ్ళెదవు.

నిజానికి దేవుని చిత్తమును తెలిసికొన్న తరువాత విధేయత చూపకుండా నుండుటకు న్యాయ సమ్మతమైన కారణ మేమీ ఉండదు. నీవు ఆయనకు ఈరోజే విధేయుడవు కావాలని కోరబడుచున్నావు, క్రీస్తు నీవు వచ్చి ఆయనను గూర్చి తెలిసికొని ఆయనను వెంబడించాలని నిన్ను ఆహ్వానించుచున్నాడు (మత్త 11:28-30). నీవు నమ్మి బాప్తిస్మము పొందిన యెడల రక్షణను ఆయన నీకు వాగ్దానము చేయుచున్నాడు (మార్కు 16 : 16). క్రీస్తు చెప్పిన మాటను జ్ఞాపకము చేసికొనుము.

"యేసు — నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" (యోహా 14:6).

---

## నజరేయుడైన క్రీస్తు ఎవరు ?

నజరేయుడైన క్రీస్తును గూర్చి లోకం భిన్నమైన అభిప్రాయములు కలిగియున్న మాట నిజం. అదే సమయంలో క్రైస్తవుల మనుకొంటున్న వారిలో అనేకులకు క్రీస్తును గూర్చి సరియైన అవగాహన లేకపోవుట కూడ గమనించగలం. ఆయన ఈ లోకంలో యున్నప్పుడు "పరిసయ్యులు కూడి యుండగా యేసు వారిని చూచి — క్రీస్తును గూర్చి మీ కేమి తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడని అడిగెను. వారు దావీదు కుమారుడని చెప్పిరి. అందుకాయన ఆలాగైతే

నేను నీ శత్రువులను నీ పాదముల క్రింద ఉంచువరకు నీవు నా కుడి పార్శ్వమున కూర్చుండు మని ప్రభువు నా ప్రభువుతో చెప్పెను అని దావీదు ఆయనను ప్రభువని, ఆత్మవలన ఏల చెప్పుచున్నాడు? దావీదు ఆయనను ప్రభువని చెప్పిన యెడల ఆయన యేలాగు అతనికి కుమారు డగునని వారి నడుగగా ఎవడును మారుమాట చెప్పలేకపోయెను". (మత్త 22 : 41-46).

## కొందరి అభిప్రాయాలు

ఒకనాడు యేసు సమాజ మందిరములో బోధించుచుండగా వారాశ్చర్యపడి ఈ జ్ఞానమును ఈ అద్భుతములును ఇతని కెక్కడ నుండి వచ్చినవి? ఇతను వడ్లవాని కుమారుడు కాడా? ఇతని తల్లి పేరు మరియ కాదా? యాకోబు యోసేపు సీమోను యూదా అను వారు ఇతని సోదరులు కారా? ... ... అని చెప్పుకొని ఆయన విష యమై అభ్యంతరపడిరి (మత్త 13 : 54-56). చతుర్థాధి పతియైన హేరోదు యేసును గూర్చిన సమాచారము విని, ఇతడు బాప్తిస్మ మిచ్చు యోహాను; ఇతడు మృతులలోనుండి లేచి యున్నాడు అందు వలననే అద్భుతములు ఇతని యందు క్రియారూపకములగుచున్నవని తన సేవకులతో చెప్పెను (మత్త 14 : 1;2). మరికొందరు "మంచి వాడనిరి - మరికొందరు కాడు ఆయన జనులను మోసపుచ్చువాడనిరి" (యోహా 7 : 12). యేసు ఫిలిప్పుదైన కైసరయ ప్రాంతములకు వచ్చి - మనుష్య కుమారుడు ఎవడని చెప్పుకొనుచున్నారని తన శిష్యుల నడుగగా వారు కొందరు బాప్తిస్మ మిచ్చు యోహాననియు కొందరు ఏలీయా అనియు కొందరు యిర్మీయా అనియు లేక ప్రవక్త లలో ఒకడనియు చెప్పుకొనుచున్నారనిరి (మత్త 16 : 13,14). మరియు పరిసయ్యులలో కొందరు ఈ మనుష్యుడు విశ్రాంతి దినము ఆచ రించుట లేదు గనుక దేవుని యొద్దనుండి వచ్చినవాడు కాడనిరి - మరికొందరు పాపియైన మనుష్యుడు ఈలాటి సూచకక్రియలు ఏలాగు

చేయగలడనిరి. ఇట్టి వారిలో భేదము పుట్టెను (యోహా 9 : 16). ఈ విధముగా ఆనాడు ఈనాడు భిన్నాభిప్రాయాలు ప్రజలలోనుండి వింటున్నాము. అదే సమయంలో దినదినము అనేకులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుట చూస్తున్నాము, వింటున్నాము.

## అయితే ధర్మశాస్త్ర మేమంటున్నది ?

"ఇద్దరు సాక్షుల మాట మీదనైనను ముగ్గురు సాక్షుల మాట మీదనైనను ప్రతిసంగతి స్థిరపరచబడును" (ద్వితి 19 : 15). యేసు "మరియు ఇద్దరు మనుష్యుల సాక్ష్యము సత్యమని మీ ధర్మశాస్త్రములో వ్రాయబడి యున్నదిగదా! నన్ను గూర్చి నేను సాక్షము చెప్పుకొనువాడను. నన్ను పంపిన తండ్రియు నన్ను గూర్చి సాక్ష్య మిచ్చుచున్నాడు" (యోహా 8 : 17, 18). "ఇద్దరు ముగ్గురు సాక్షుల నోట ప్రతి మాటయు స్థిరపరచబడును" (II కొరింథి 13 : 1) అని వ్రాయబడి యుండెను.

**ప్రవక్తలు ప్రవచించిరి**—మొదట ప్రవచన మనగా నేమో తెలుసుకొని, తరువాత ఏమని ప్రవచించిరో పరిశీలిందము—ప్రవచన మనగా ఈ సందర్భములో ప్రవచనంలో భూత భవిష్యత్ వర్తమాన కాల సంగతులు ఇమిడి యుండాలి. భూత, భవిష్యత్ వర్తమానకాల సంగతులు దేవుని యొక్క స్వాధీనములో మాత్రమే ఉండును. ఇందును గూర్చి దేవుడైన యెహోవా— "ఆదిలో నున్న జనమును నియమించినది మొదలుకొని నేను తెలియ జేయుచు వచ్చినట్లు తెలియ జేయగలవాడెవడు ? అట్టి వాడెక్కడైన నుండిన యెడల నాకు తెలియజెప్పవలెను. ఆ సంగతి నాకు ప్రచురింపవలెను. అట్టివారు భవిష్యత్ విషయమును రాబోవు సంగతులను తెలియజెప్పు వారై యుండవలెను" (యెష 44:7). కనుక "ప్రవచనము ఎన్నడును, మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు, గాని మనుష్యులు పరిశుద్ధాత్మద్వారా

ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగా పలికిరి" (II పేతు 1:21). గనుక బైబిలు దైవప్రేరితం అవునని బైబిలు దానంతటదే రుజువు జేసుకొనుచున్నది.

ప్రవక్తల సాక్ష్యం : ప్రవక్త యెషయా "కాబట్టి ప్రభువు తానే యొక సూచన మీకు చూపును. ఆలకించుడి కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును" (యెష 7:14) మరియు "ఏల యనగా మనకు శిశువు పుట్టెను మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజముల మీద రాజ్యభార ముండును. ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి సమాధాన కర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును." (యెష 9 : 6).

మీకా ప్రవక్త సాక్ష్యం: "బేత్లెహేము ఎఫ్రాతా యూదావారి కుటుంబములలో, నీవు స్వల్ప గ్రామమైనను, నీ కొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు నీలోనుండి వచ్చును. పురాతన కాలము మొదలుకొని శాశ్వతకాలము ఆయన ప్రత్యక్షమగుచుండెను" (మీకా 5:2).

దూత సాక్ష్యం : "గబ్రియేలను దేవదూత గలిలైలోని నజరేతను ఊరిలో.. కన్యక యొద్దకు దేవునిచేత పంపబడెను. ఆ కన్యక పేరు మరియ...దూత మరియా భయపడకుము, దేవునివలన నీవు కృప పొందితివి. ఇదిగో నీవు గర్భముధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు. ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును....ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు యేలును. ఆయన రాజ్యము అంతములేనిదై యుండునని ఆమెతో చెప్పెను...సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు

శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును (లూకా 1:26-35). ఇదే సందర్భములో ప్రభువు దూత "దావీదు కుమారుడవైన యోసేపూ నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము. ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మవలన కలిగినది. ఆమె యొక కుమారుని కనును. తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను" (మత్త 1:20, 21). యోసేపు... ప్రభువుదూత తనకు ఆజ్ఞాపించిన ప్రకారము చేసి ఆమె కుమారుని కనువరకు ఆమెను ఎరుగకుండెను. అతడు ఆ కుమారునికి యేసు అను పేరు పెట్టెను (మత్త 1:24, 25).

**గొల్లల కాపరుల సాక్ష్యం :**—"ప్రభువు దూత వారియొద్దకు వచ్చి.. భయపడకుడి ప్రజలందరికి కలుగబోవు మహా సంతోషకరమైన వర్తమానము...దావీదుపట్టణమందు నేడు రక్షకుడు మీకొరకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు. దానికిదే మీకానవాలు. ఒక శిశువు పొత్తిగుడ్డలతో చుట్టబడి యొక తొట్టిలో పండుకొనియుండుట మీరు చూచెదరని వారితో చెప్పెను. వెంటనే పరలోక సైన్య సమూహము ఆయనతో కూడ నుండి . దేవునికి స్తోత్రము చేయుచుండెను. ఆ దూతలు తమయొద్ద నుండి పరలోకమునకు వెళ్లిన తరువాత గొల్లల కాపరులు.. బెత్లెహేము వెళ్ళి . మరియను యోసేపును తొట్టిలో పండుకొని యున్న శిశువుని చూచిరి" (లూకా 2:9-16).

**పరిశుద్ధాత్ముని సాక్ష్యం :**— యోహాను యేసుకు బాప్తిస్మమిచ్చిన తరువాత యేసు "ప్రార్థన చేయుచుండగా ఆకాశము తెరువబడి పరిశుద్ధాత్మ శరీరాకారముతో పావురమువలె అతని మీదికి దిగివచ్చెను" (లూకా 3:21;22).

<u>తండ్రియైన దేవుని సాక్ష్యం</u> :-"మరియు - ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నానని యొక

శబ్దము ఆకాశమునుండి వచ్చెను" (మత్త 3:17). మరియు "పేతురు, యాకోబు, అతని సహోదరుడైన యోహాను.. యెదుట (యేసు) రూపాంతరము పొందెను. . ఇదిగో ఈయన నా ప్రియకుమారుడు ఈయన యందు నేనానందించుచున్నాను. ఈయన మాట వినుడని యొక శబ్దము ఆ మేఘములోనుండి పుట్టెను" (మత్త 17:1-5).

కుమారుని సాక్ష్యం :- నా యిష్టము నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటకే పరలోకము నుండి దిగివచ్చితిని....కుమారుని చూచి ఆయనయందు విశ్వాస ముంచు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే నా తండ్రి చిత్తము. అంత్యదినమున నేను వానిని లేపుదును (యోహా 6:38-40).

దయ్యం సాక్ష్యం :- "యేసూ సర్వోన్నతుడైన దేవుని కుమారుడా, నాతో నీ కేమి?...నన్ను బాధపరచకుమని బిగ్గరగా కేకలు వేసెను" (మార్కు 5:7).

దొంగ సాక్ష్యం :- యేసు కిరుప్రక్కల ఇద్దరి దొంగలను శిలువలో వ్రేలాడ దీసిరి. ఒక దొంగ యేసును దూషించుచు "నీవు క్రీస్తువుగదా? నిన్ను నీవు రక్షించుకొనుము మమ్మునుకూడ రక్షించుమని చెప్పెను. అయితే రెండవవాడు వానిని గద్దించి...దేవునికి భయపడవా? . యీాయన ఏ తప్పిదమును చేయలేదని చెప్పి... యేసూ నీ రాజ్యములోనికి వచ్చునపుడు నన్ను జ్ఞాపకము జేసుకొనుమనెను" (లూకా 23:39-42).

శతాధిపతితో సహా మరి కొందరు సాక్ష్యం :-యేసు సిలువపై ప్రాణము విడవగా "అప్పుడు దేవాలయపు తెరపైనుండి క్రిందివరకు రెండుగా చినిగెను, భూమి వణకెను, బండలు బద్దలాయెను. సమాధులు తెరవబడెను. నిద్రించిన అనేకమంది పరిశుద్ధుల శరీరములు

లేచెను... శతాధిపతియు అతనితో కూడ యేసునకు కావలియున్నవారును భూకంపమును జరిగిన కార్యములన్నియు చూచి, మిక్కిలి భయపడి - నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి" (మత్త 27 : 51-54).

శిష్యులు సాక్ష్యం :- "మీరు పరిశుద్ధుడును నీతిమంతుడును యైన వానిని నిరాకరించి, నరహంతకుడైన మనుష్యుని మీకు అనుగ్రహింపుమని అడిగితిరి. మీరు జీవాధిపతిని చంపితిరి. గాని దేవుడు ఆయనను మృతులలోనుండి లేపెను. అందుకు మేము సాక్షులము" (అ. కా. 3 : 14, 15).

ప్రకృతి లోబడింది :- ఒకప్పుడు యేసు శిష్యులతో కలసి చిన్న దోనెలో ప్రయాణము చేయుచుండెను. యేసు దోనె అమరమున, తలగడ మీద (తల వాల్చుకొని) నిద్రించుచుండెను. "అప్పుడు పెద్ద తుఫాను రేగి ఆయన యున్న దోనెమీద అలలు కొట్టినందున దోనె నిండిపోయెను ... వారాయనను లేపి - బోధకుడా మేము నశించి పోవుచున్నాము నీకు చింతలేదా ? అని ఆయనతో అనిరి. అందుకాయన లేచి గాలిని గద్దించి - నిశ్శబ్దమై ఊరకుండుమని సముద్రముతో చెప్పగా గాలి అణిగి మిక్కిలి నిమ్మళమాయెను ... వారు మిక్కిలి భయపడి - ఈయన ఎవరో గాలియు సముద్రమును ఈయనకు లోబడుచున్నవని యొకనితో ఒకడు చెప్పుకొనిరి" (మార్కు 4 : 36-41) "మరియు ఆయన సముద్రము మీద నడచుట శిష్యులు చూచి తొందరపడి భూతమని చెప్పుకొని భయముచేత కేకలు వేసిరి. వెంటనే యేసు - ధైర్యము తెచ్చుకొనుడి; నేనే భయపడకుడని వారితో చెప్పగా ... ... అంతట దోనెలో ఉన్నవారు వచ్చి - నీవు నిజముగా దేవుని కుమారుడవని చెప్పి ఆయనకు మ్రొక్కిరి." (మత్త 14 : 26 to 33).

**యేసు ఆశ్చర్యకరుడు** :— యేసు గలిలయ సముద్రతీరమున కూర్చొని యుండగా "బహుజన సమూహములు ఆయన యొద్దకు కుంటివారు గ్రుడ్డివారు మూగవారు అంగహీనులు మొదలైన అనేకులను తీసికొని వచ్చి ఆయన పాదముల యొద్ద పడవేసిరి. ఆయన వారిని స్వస్థతపరచెను. మూగవారు మాటలాడుటయును అంగహీనులు బాగుపడుటయును కుంటివారు నడచుటయును గ్రుడ్డివారు చూచుటయును జనసమూహము చూచి ఆశ్చర్యపడి ఇశ్రాయేలు దేవుని మహిమ పరచిరి" (మత్త 15 : 30, 31).

**యేసు జీవన దాత** :— చనిపోయిన లాజరు శరీరము సమాధిలో నాలుగు దినములనుండి యుండగా యేసు "లాజరూ బయటకు రమ్మని బిగ్గరగా చెప్పగా చనిపోయినవాడు కాళ్లు చేతులు ప్రేత వస్త్రములతో కట్టబడినవాడై వెలుపలకు వచ్చెను". (యోహా 11 : 43, 44).

**యేసు మృత్యుంజయుడు** :- "ఆదివారమున తెల్లవారుచుండగా (ఆ స్త్రీలు) తాము సిద్ధపరచిన సుగంధ ద్రవ్యములను తీసికొని సమాధి యొద్దకు వచ్చిరి. సమాధి ముందర ఉండిన రాయి దొర్లింపబడి యుండుట చూచి లోపలికి వెళ్లిరిగాని ప్రభువైన యేసు దేహము వారికి కనబడలేదు ......ప్రకాశ మానమైన వస్త్రములు ధరించిన ఇద్దరు మనుష్యులు వారియొద్ద నిలువబడిరి ... ... వీరు సజీవుడైన వానిని మీరెందుకు మృతులలో వెదుకుచున్నారు. ఆయన ఇక్కడలేడు, ఆయన లేచియున్నాడు... మనుష్య కుమారుడు పాపిష్ఠులైన మనుష్యులచేత కప్పగింపబడి, సిలువ వేయబడి మూడవ దినమందు లేవవలసి యున్నదని ఆయన మీతో చెప్పిన మాట జ్ఞాపకము చేసికొనుడని వారితో అనిరి" (లూకా 24 : 1-7). "ఆయన శ్రమపడిన తరువాత నలుబది దినములవరకు వారి కగుపడుచు దేవుని రాజ్య

విషయములను గూర్చి బోధించుచు అనేక ప్రమాణములను చూపి వారికి తన్ను తాను సజీవునిగా కనుబరచుకొనెను" (అ. కా. 1 : 3).

**యేసు ఆరోహణుడాయెను:—** "వారిని (శిష్యులను) ఆశీర్వదించుచుండగా ఆయన వారిలోనుండి ప్రత్యేకింపబడి పరలోకమునకు ఆరోహణుడాయెను" (లూకా 24 : 51).

"యేసుక్రీస్తు శరీరమునుబట్టి దావీదు సంతానముగాను మృతులలోనుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింపబడెను" (రోమా 1:1-7).

— కె. జార్జి, ఎ. వేమవరప్పాడు.

---

పది ఆజ్ఞలు :

## అబద్ధ సాక్ష్యము పలుకకూడదు

## ( Thou Shall Not Bear False Witness )

దేవుడు మానవుని చేసినప్పుడు సృష్టి యంతటికి ఉన్నతునిగా అతని చేసాడు. జంతువులవలె గాక మానవుడు ఆలోచించగలడు, వివేచింపగలడు, ఎంచుకోగలడు. అతడు తన భావాలను నోటి మాటలతో వ్యక్తపరచగలడు. మానవుని నాలుక ఒకని సంతోషపరచ గలదు, దుఃఖపెట్టగలదు.

దేవుడిచ్చిన పది ఆజ్ఞలలో రెండు ఆజ్ఞలు నాలుకను గూర్చి ఇయ్యబడినవి. "నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు" అని నిర్గమ 20:7లో దేవుడు నాలుకనుగూర్చిన జాగ్రత్త తెలియజేసాడు. నిర్గమ 20:16లో ఈరోజు మన పాఠ్యభాగమైన ఆజ్ఞ కనబడుచున్నది. "నీ పొరుగు వానిమీద అబద్ధ సాక్ష్యము

పలుకకూడదు" అని చెప్పుచు నాలుకను గూర్చిన రెండవ ఆజ్ఞను దేవుడిచ్చాడు. యిది పది ఆజ్ఞలలో తొమ్మిదవ ఆజ్ఞ.

మానవుని ఆత్మీయ నైతిక సాంఘిక విలువలను పరిరక్షించుటకు పది ఆజ్ఞలను దేవుడిచ్చాడు. 'నీ పొరుగువానిమీద అబద్ధ సాక్ష్యము పలుకకూడదు' అని దేవుడిచ్చిన ఆజ్ఞ మానవుని గౌరవ ప్రతిష్టలను, మంచి పేరును కాపాడుటకు ఇయ్యబడింది. నీ పొరుగు వానిని గూర్చి నీవు అబద్ధములాడకూడదు, కల్లబొల్లి మాటలు కల్పించకూడదు, అబద్ధ సాక్ష్యము పలుకకూడదు.

## దేవునికి హేయము

దేవునికి అసహ్యమైనవి, లేక హేయమైనవి ఏడు సంగతులు కలవని జ్ఞానియైన సొలొమోను చెప్పాడు. "అవేవనగా, అహంకార దృష్టియు, కల్లలాడు నాలుకయు, నిరపరాధులను చంపు చేతులును, దుర్యోచనలు యోచించు హృదయమును, కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును, లేనివాటిని పలుకు అబద్ధ సాక్షియు, అన్న దమ్ములలో జగడములు పుట్టించువాడును" అని సామె 6:16-19లో వ్రాయబడి యున్నది. "అబద్ధమాడు పెదవులు యెహోవాకు హేయములు. సత్యవర్తనులు ఆయన కిష్టులు" అని సామె 12:22లో వ్రాయబడి యున్నది. "కూటసాక్షి శిక్ష నొందకపోడు. అబద్ధము లాడువాడు తప్పించుకొనడు" అని సామెతలు 19:5 లో సొలొమోను మరల చెప్పాడు.

"యెహోవా, అబద్ధమాడు పెదవుల నుండియు, మోసకరమైన నాలుక నుండియు నా ప్రాణమును విడిపించుము" అని దావీదు మహారాజు ప్రార్థించాడు (కీర్త 120:2). "యెహోవా, నా నోటికి కావలి యుంచుము, నా పెదవుల ద్వారమునకు కాపు పెట్టుము" అని అతడు మరల ప్రార్థించాడు (కీర్త 141:3).

అబద్ధమాడు నాలుక వలన కలిగే హాని ఇంత అంత కాదు. అది పొరుగువాని గౌరవ ప్రతిష్టలను భంగము చేయుటయే గాక, అబద్ధము లాడువానికి నాశనము కలుగజేస్తాది. యేసుప్రభువు ఇట్లు బోధించాడు: "నేను మీతో చెప్పున దేమనగా - మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్ప వలసి యుండును. నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పు నొందుదువు" (మత్త 12:35, 37). "మనము ఒకరికొకరము అవయవములై యున్నాము గనుక మీరు అబద్ధమాడుట మాని ప్రతివాడును తన పొరుగువానితో సత్యమే మాటలాడవలెను" అని ఎఫెసీ 4 : 25 లో అపొ. పౌలు హెచ్చరించాడు. ప్రాచీన స్వభావమును దాని క్రియలతో గూడ మీరు పరిత్యజించి నూతన స్వభావమును ధరించుకొని యున్నారు గనుక ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి యని అతడు కొలస్స 3:9లో హెచ్చరించాడు.

## పాప ప్రవేశం

ఆదిలో అపవాది చెప్పిన అబద్ధ సాక్ష్యము వలన మానవజాతి అంతయు పాపములో పడింది. మంచిచెడ్డలను తెలియజేయు వృక్ష ఫలమును మీరు తినకూడదు. వాటిని తిను దినమున మీరు నిశ్చయముగా చచ్చెదరని దేవుడు ఆదాము హవ్వలను ఆజ్ఞాపిస్తే, అపవాది వారి దగ్గరకు వచ్చి "మీరు చావనే చావరు; ఏలయనగా మీరు వాటిని తిను దినమున మీ కన్నులు తెరవబడుననియు, మీరు మంచి చెడ్డలను ఎరిగినవారై దేవతలవలె ఉందురనియు దేవునికి తెలియునని" అబద్ధసాక్ష్య మిచ్చాడు (ఆది 3:4, 5). వారాఫలములను తిన్నారు, మోసగించబడ్డారు, పాపములో బడ్డారు. ఇట్లు ఒక మనుష్యుని ద్వారా పాపమును, పాపముద్వారా మరణమును లోకములో ప్రవేశించాయి. మానవుడు పాపము చేసినందువలన మరణము అందరికిని సంప్రాప్తమయ్యింది (రోమా 5:12).

# చిన్నది గాని గొప్పది.

అబద్ధములాడువాడు తనకు తాను హాని కలుగజేసికొనుటయే గాక, ఎదుటివాని పేరు ప్రతిష్టలకు హాని కలుగజేయును. అందువలన "గొప్ప ఐశ్వర్యము కంటె మంచి పేరును వెండి బంగారములకంటె దయయు కోరదగినవి" యని సామె 22:1లో వ్రాయబడి యున్నది. ఒకని నాలుక పొరుగువాని మంచి పేరును కాపాడగలదు, లేదా పాడు చేయగలదు. కనుక ఒకడు తన నాలుకను గూర్చి చాల జాగ్రత్త కలిగియుండాలి. భక్తుడైన యాకోబు ఇట్లు హెచ్చరించుచున్నాడు : "ఎవడైనను మాటయందు తప్పనియెడల అట్టివాడు లోపము లేనివాడై తన సర్వ శరీరమును స్వాధీనమందుంచుకొనగ శక్తిగల వాడగును... నాలుకకూడ చిన్న అవయవమైనను బహుగా అదిరిపడును. ఎంత కొంచెము నిప్పు ఎంత విస్తారమైన అడవిని తగులబెట్టును! నాలుక అగ్నియే; నాలుక మన అవయవములలో ఉంచబడిన పాపప్రపంచమై సర్వశరీరమునకు మాలిన్యము కలుగజేయుచు, ప్రకృతి చక్రమునకు చిచ్చుపెట్టును; అది నరకముచేత చిచ్చు పెట్టబడును. మృగ పక్షి సర్ప జలచరములలో ప్రతి జాతియు నరజాతిచేత సాధు కాజాలును, సాధు ఆయెను గాని యే నరుడును నాలుకను సాధుచేయ నేరడు; అది మరణకరమైన విషముతో నిండినది. అది నిరర్గళమైన దుష్టత్వమే. దీనితో తండ్రియైన ప్రభువును స్తుతింతుము, దీనితోనే దేవుని పోలికగా పుట్టిన మనుష్యులను శపింతుము. ఒక్క నోటినుండియే ఆశీర్వచనమును, శాప వచనమును బయలు వెళ్ళును; నా సహోదరులారా, యీలాగుండ కూడదు" (యాకోబు 3:2-10).

నిజానికి ఒకని ఆత్మీయ పరిస్థితి ఎట్లున్నదో అతని నోరు, లేక నాలుక బయలుపర్చును. "హృదయమందు నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడును గదా" (మత్త 12:34). కనుక "ఎవడైనను నోటికి కళ్లెము పెట్టుకొనక తన హృదయమును మోసపరచుకొనుచు భక్తిగలవాడనని అనుకొనిన యెడల వాని భక్తి వ్యర్థమే" (యాకోబు

1:26). కొందరు లోపల భక్తి లేకపోయినను పైకి భక్తిపరుల వలె నటిస్తారు. "దేవుని యెరుగుదుమని వారు చెప్పుకొందురు గాని, అసహ్యులును అవిధేయులును ప్రతి సత్కార్యము విషయము భ్రష్టులునై యుండి తమ క్రియల వలన ఆయనను ఎరుగనట్టున్నారు" (తీతు 1:16). ఈ లోకములో అనేకులైన అబద్ధ బోధకులున్నారు. దేవుని వాక్యమును ఉన్నది ఉన్నట్టుగా బోధించనివారు అపవాది సేవకులే. ఏలయనగా అపవాది అబద్ధికుడును, అబద్ధమునకు జనకుడునై యున్నాడు (యోహా 8:44). అబద్ధికులందరు అగ్ని గంధకములతో మండు గుండములో పాలు పొందుదురు (ప్రక 21:8). అబద్ధమును ప్రేమించి జరిగించు ప్రతివాడును పరలోకమునకు వెలుపట నుండును అని దేవుని వాక్యము చెప్పుచున్నది (ప్రక 22:15).

అబద్ధములాడుట వలన, అబద్ధ బోధకు లోబడుట వలన ఒకడు తన ఆత్మను నిత్య నాశనమునకు నడిపించును. నీవు సత్యమైయున్న క్రీస్తు నొద్దకు వచ్చి, ఆయన యందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది ఈనాడే రక్షింపబడుము. నీ పొరుగువాని మీద అబద్ధ సాక్ష్యము పలుకకూడదని జ్ఞాపకముంచుకొనుము! ★

— జాషువా గూటం.

## క్రీస్తు సంఘము సాటిలేనిది

## (The Church of Christ is Distinctive)

—జానీ రామేస్.

ఇండియాలోగాని అమెరికాలోగాని లేక ప్రపంచమందలి పెద్ద రహదార్లపై ప్రయాణించునప్పుడు మతసంబంధమైన విభజనలు స్పష్టముగ కనబడును. వివిధములైన పేర్లు వ్రాయబడిన ప్రార్థనా మందిరములు విభజనలను తెలియజేయుచు కనబడును. కొన్ని సంవత్సరాల క్రితము ఒక అంతర్జాతీయ సువార్తికుడు నేడు భూమిమీద 800

వేరు వేరు సంఘాలున్నట్లు చెప్పిన సంగతి నేను విన్నాను! 20 సంవత్స రాల క్రితము అమెరికాకు చెందిన పరిచురణకర్త ఉత్తర అమెరికాలో నున్న 254 మత శాఖల పట్టిక కలిగిన పుస్తకమును విడుదల చేసెను. క్రీస్తు మరణించినది ఇందుకొరకా? కాదు. క్రైస్తవులంతా ఏకమై యుండాలని ఆయన చేసిన ప్రార్థనను ఈ విషయాలు తిరస్కరించు చున్నాయి (యోహా 17:20-21). ఈ రకమైన విభజన ఆత్మసంబంధ మైనది కాదని పౌలు ఖండించెను (1 కొరింథీ 1:10). ఎఫెస్సీ 4:1-6లో చెప్పబడినట్లు పరిశుద్ధాత్మ కోరిన దైవికమైన ఐక్యతయొక్క క్రమ మును మనము కలిగి యుండాలి. ప్రభువు ఒకే ఆత్మీయ శరీరమును కట్టుటకు వాగ్దానము చేసెను (మత్త 16:18). ఆదిమ శతాబ్దములో పౌలు, పేతురు, యాకోబు, యోహాను, ఫిలిప్పు మరియు స్తెఫను ఈ సంఘ సభ్యులై యున్నారు. అది క్రీస్తుయొక్క విలువైన రక్తముతో కొనబడినట్టిది. అది ప్రత్యేకమైనది, ఏకత్వము కలది, అదే ప్రభువు సంఘము యిప్పుడు కూడ ఉన్నది.

విభజింపబడి, అసామాన్యమైన స్థితిలో నుండుట యందు ప్రత్యే కత ఏమియు లేదు. క్రీస్తు సంఘము సాటిలేనిది ఎందుకనగా అది బైబిలుపై ఆధారపడి నడచునట్టిది. ఇందు వలన దాని నిర్వహణ, బోధ, ఆరాధన, సంఘ జీవితము కలవరపరచేవిగా లేవు.

క్రొత్త నిబంధనలో సంఘమును గూర్చి 150 కంటె ఎక్కువ సార్లు ప్రస్తావించబడింది. పరలోక రాజ్యమని కూడ వర్ణించబడినది. ఎఫెస్సీ 5వ అధ్యాయములో క్రీస్తుకు సంఘము లోబడి యుండాలని చెప్పబడింది. ఒక పోపుకుగాని, మానవ సమావేశాలకుగాని, విశ్వాస ప్రమాణ పుస్తకానికి గాని లోబడక దేవునికే లోబడి యుండాలి. ఈ సత్యము క్రీస్తు సంఘముయొక్క ప్రత్యేకతను గొప్పగా వివరించు చున్నది. ఎఫెస్సీ 3 : 21 నందు "సంఘములో" ఇప్పుడు తర

తరములకు దేవుడు మహిమ పర్చబడాలని వ్రాయబడినట్లు మనము నేర్చుకొనుచున్నాము. మనము చదువుచున్న పాఠ్యాంశము యొక్క విలువ దేనితోను పోల్చలేనట్టిది.

ప్రభువు సంఘము నేడున్నదా? బైబిలులో వ్రాయబడిన సంఘమును పోలిన సంఘము ఈ 20వ శతాబ్దములో ఉండుట అసాధ్యమని కొందరి అభిప్రాయము. లూకా 8:11 చదువుదాం.

## "విత్తనము దేవుని వాక్యము"

ఎక్కడ మానవులు దేవుని వాక్యమునకు ఖచ్చితముగ విధేయత చూపుదురో అక్కడ ప్రభువు సంఘముండును. మొదటి శతాబ్దములో వారేమి చేసిరో మనమును వాక్యానుసారముగ అది జరిగించిన యెడల వారేమైయున్నారో మనమును అట్టి వారమైయున్నాము. వారు క్రైస్తవులై యుండిరి (1 పేతు 4:16). వారు క్రీస్తు సంఘసభ్యులు (రోమా 16:16.)

మరొక వాదన ఉన్నది: "స్వచ్ఛమైన క్రైస్తవ్యము స్థాపింపబడి చాలా సంవత్సరములు గతించిపోయినవి. చీకటి యుగమందు దైవికమైన సత్యము అంతరించిపోయినది. మనము క్రైస్తవులముగా ఇక ఉండలేము. మనము ఏదో ఒక మతశాఖలో సభ్యులమై మాత్రమే యుండగలము". వేలాదిమంది ఈ విధమైన నిర్ణయానికే వచ్చుచున్నారు. కాని ఇది నిజమా? యెహోవా నోటనుండి వచ్చు వచనము నిష్ఫలముగా మరలదని చెప్పబడెను (యెష55:11). దైవావేశము వలన కలిగిన లేఖనములు దైవజనుని సంపూర్ణనిగా చేయునని 2 తిమోతి 3:16-17 చెప్పుచున్నది. దైవసత్యముపై అపవాదికి జయము కలుగునట్లు మానవుని విమోచనా సంకల్పమును మార్చగలుగుటకు దేవుడే అధికారమిచ్చెననే తలంపు చాలా వింతగా నున్నది. 1900 సంవత్స

రాల క్రితము వారెట్లు క్రీస్తు దాసులై యుండిరో మనముకూడ అట్లే ఆయనకు నేడు దాసులమై యుండగలము. సువార్త శక్తిని ఈ మధ్య జరిగిపోయిన సంవత్సరాలు మరుగుచేయలేవు. రక్షణ కొరకు అదే బోధ యిప్పుడున్నది (రోమా 1:16, 2 థెస్స 2:14).

మనం చెప్పే సంగతుల కొరకు ఒక ఉదాహరణ చెప్పుకొందాం. 'బేస్‌బాల్' ఆట కొన్ని శతాబ్దాల పాటు ఆడడం మానివేసి మరల 2550వ సంవత్సరములో ఒకడు 1963లో వ్రాయబడిన బేస్ బాల్ ఆట నిబంధనల పుస్తకమును సంపాదించి మరల 2550వ సంవత్సరములో ఈ ఆటను ఖచ్చితముగ ఆడవచ్చును. ఆ కాలంలో ఆడిన బేస్ బాల్ ఆటకు యిది ఏమాత్రము వేరుగా ఉండదు. గతించిన కాలం విషయాన్ని మార్చదు. యిదే సూత్రము క్రైస్తవ్యానికి కూడ వర్తించును. క్రొత్త నిబంధనలో వ్రాయబడిన బోధకు విధేయత చూపి అదే బోధను బోధించినట్లయితే మనము క్రీస్తు సంఘ సభ్యులముగా నుండగలము. అందు ఏది తొలగించిననూ నిష్ఫలమే. క్రొత్త నిబంధనలో బయలు పరచబడిన సంఘముయొక్క ప్రత్యేక స్వభావమును మనం కలసి గ్రహించుదాం.

## లేఖనములకు ప్రాముఖ్యత

మొదటిగా క్రీస్తు సంఘము లేఖనముల యెడల దాని ఉద్దేశ్యమును బట్టి సాటిలేనిది. కేథలిక్ అధికారమునకు మానవకల్పిత సిద్ధాంతాలకు ఇచ్చుట ఏప్రాముఖ్యము లేదు. గ్రంథములకు గ్రంథమైన బైబిలు అట్టివారికి లోబడుట బుద్ధిహీనత యని జ్ఞాపకము చేయుచున్నది. మూడు వచనాల్ని పరిశీలించుదాం.

కొలస్స 2 : 8

"ఆయనను అనుసరింపక మనుష్యుల పారంపర్యాచారమును,

అనగా ఈలోక సంబంధమైన మూల పాఠములను అనుసరించి మోస కరమైన నిరర్థక తత్వజ్ఞానము చేత మిమ్మును చెరపట్టుకొని పోవువాడెవ డైన ఉండునేమో అని జాగ్రత్తగా ఉండుడి."

మార్కు 7 : 9

"మరియు ఆయన - మీరు మీ పారంపర్యాచారమును గైకొను టకు దేవుని ఆజ్ఞను బొత్తిగా నిరాకరించుదురు".

మత్తయి 28 : 18

"యేసు వారి యొద్దకు వచ్చి—పరలోక మందును భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది."

అవును, క్రీస్తుకు పరలోకమందును, భూమి మీదను అధి కారము కలదు. ఆయన శక్తిగల వాక్యము ద్వారా మనలను నడి పించుచున్నాడు. రోమాలో నున్న పోపు అధికారమువలన మనము నడిపించబడుటలేదు. "స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియ మము" (యాకో 1 : 25)నకు మనము విధేయత చూపిన యెడల మానవ పారంపర్యాచారములను పారద్రోల గలము.

బైబిలు యెడల క్రీస్తు సంఘము యొక్క గురియేదో అందరికీ తెలిసిన ఈ మాట ద్వారా విశదమగుచున్నది.

"మేము బైబిలు మాట్లాడుచోట మాట్లాడుదుము. బైబిలు మౌనముగా నున్నచోట మౌనముగా నుందుము"

"టైమ్" పత్రిక మతము అనే శీర్షికలో "క్రీస్తు సంఘసభ్యులు మిగిలిన వారికంటె బైబిలును పాటించేవారని" వ్రాసింది. యిది వారి మాటగా మేము అంగీకరించుదుము. ఎందుకనగా రెండు చక్కని వచనాలతో ఈ మాటకు సంబంధమున్నది.

యాకోబు 1 : 21.

"మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్విక ముతో అంగీకరించుడి"

అపో. కార్య 20 : 32.

"ఇప్పుడు దేవునికిని ఆయన కృపావాక్యమునకును మిమ్మును అప్పగించుచున్నాను. ఆయన మీకు క్షేమాభివృద్ధి కలుగజేయుటకును, పరిశుద్ధ పరచబడిన వారందరిలో స్వాస్థ్యమునను గ్రహించుటకును శక్తిమంతుడు."

నిజముగా, ఆయన జీవమునకును భక్తికిని కావలసిన వాటి నన్నిటిని మనకు దయచేయుచున్నాడనే (II పేతు 1 : 3) లేఖనాలు చెప్పే విషయాన్ని మేము నమ్ముచున్నాము. దేవుని దృష్టిలో పూర్ణముగా సిద్ధపడియుండునట్లు లేఖనములు మాత్రమే ప్రయోజనకరమైనవి (II తిమో 3 : 16-17). అందువలన మనకు విశ్వాస ప్రమాణ పుస్తకాలుగాని, ఈ మధ్య కాలంలో బయలు పరచబడినవని చెప్పే విషయాలుగాని, పోపు యొక్క సార్వత్రిక అధికారముగాని అవసరంలేదు. ఓటు వేసే పరిస్థితి క్రైస్తవ్యంలో లేనేలేదు. 1900 సంవత్సరాల కంటె ముందు పరలోకంనుండి లేఖనాలు బయలు పర్చబడినవి. దేవుని వాక్యానికి మనం లోబడి యుండాలనేదే మాగురి! బైబిలు యెడల మేము కలిగియున్న ఈ గురి క్రీస్తు సంఘము సాటిలేని దనుటకు తార్కాణముగా నున్నది. ఏదైనా ఒక క్రొత్తబోధ క్రైస్తవ్యంలో కనబడినప్పుడు మనం ఒక నిర్ణయానికి రావలసియున్నది. అదేమనగా "అది సత్యమైతే క్రొత్తది కాదు, అది క్రొత్తదైతే సత్యముకాదు." ఒకానొక దినాన లేఖనముల ద్వారా మనకు తీర్పు తీర్చబడును (యోహా 12 : 48). మనం వాటి ద్వారా నడిపింపబడవలసిన వారమైయున్నాము. "ఒకడు బోధించిన యెడల దేవోక్తులను బోధించినట్టు బోధింపవలెను" (I పేతు 4 : 11). యిట్టి ఉద్దేశ్యము మనం కలిగియుంటే ఆరాధనలో గాత్ర సంగీతమును

మాత్రమే ఉపయోగించ గలము. క్రీస్తు క్రొత్తనిబంధనకు మధ్య వర్తియైయున్నాడు (హెబ్రీ 9 : 15). మీ హృదయములో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి అని వ్రాయబడియున్నది (కొలస్స 3 : 16, ఎఫెస్సీ 5 : 19). యిదే మనము చేయవలసియున్నది. 7వ శతాబ్దములో పోప్ వైటాలిన్ అనునతడు మొట్టమొదట యాంత్రిక సంగీతమును ఆరాధనా సమావేశాలలో ప్రవేశ పెట్టెనని చరిత్ర చెప్పుచున్నది. 11వ శతాబ్దము వచ్చేటప్పటికి యాంత్రిక సంగీతము సామాన్యముగ ఆచరణలోనికి వచ్చింది. గొప్ప మతనాయకులైన జాన్ కేల్విన్, జాన్ వెస్లీ, ఏడమ్ క్లార్కు మరియు ఛార్లెస్ స్పర్జన్ అనువారు యాంత్రిక సంగీతమును ఆరాధనలో ఉంపయోగించుటను వ్యతిరేకించిన సందర్భాలను మేము గుర్తు చేయగలము. కాని మేము మా ప్రభువు యొక్క అభిప్రాయమునకే ప్రాముఖ్యము నిచ్చుచున్నాము. బైబిలు యొక్క సర్వసంపూర్ణత ప్రతి ఆదివారమున ప్రభురాత్రి భోజనము జరిగించునట్లు మమ్ములను ప్రోత్సహించుచున్నది (అపో. కా. 20 : 7). మానవుడు తన ఆధిక్యత కొరకు ఏర్పాటు చేసికొన్న బిరుదులను బైబిలు వ్యతిరేకించుచున్నది. మత సంబంధమైన బిరుదులు క్రైస్తవ్యమునకు విరుద్ధమైనవని క్రీస్తు ఖచ్చితముగ బోధించెను (మత్త 23 : 1-2). ప్రతి క్రైస్తవుడు రాజులైన యాజక సమూహములో సభ్యత్వము కలిగియున్నాడు (1 పేతు 2:9). శతాబ్దాల నుండి పరిశుద్ధ లేఖనములలోని అంశాలను తీసివేసి కొన్ని మానవ కల్పిత బోధలను చేర్చుచున్నారు. చిలకరింపు, చిన్నపిల్లల బాప్తిస్మము, మరియు నామమున ప్రార్థించుట, "జన్మపాపము", ప్రత్యేక పరిశుద్ధ దినాలను ఆచరించుట మొదలగు అబద్ధ బోధలను బైబిలునందు వ్రాయబడియున్న సామాన్య వచన భాగములు ఖండించుచున్నవి. (చదవండి అపో. కా. 8 : 12, I తిమో 2 : 5 II యోహా 9, అపో. కా. 17 : 29, గలతి 4 : 10-11). (సశేషము)

సంక్షిప్త ప్రసంగము :

# దేవుని రాజ్యము

( కీర్తన 145 : 8-13 )

**పరిచయము :**

రాజ్యము అనుమాట 'బేసిలేయియా' అను గ్రీకు పదమునుండి వచ్చినది. రాజరికము, రాజాధికారము, ప్రభుత్వము అను అర్థము దానికి కలదు. దైవపరిపాలనయే దేవుని రాజ్యము, తరతరములకు మానవ హృదయాల్లో ఈ పాలన జరుగును (కీర్త 145:13). రాజ్యము యొక్క కొన్ని లక్షణములను గమనిద్దాం :

## 1. దానిలో ప్రవేశించుట కష్టము :

ఎ. అపొ. కా. 14 : 21, 22

బి. అంతకు ముందు సంభవించిన సంఘటనలనుబట్టి పౌలు అట్లు చెప్పాడు - అపొ. కా. 14 : 19.

సి. దేవుడు మన హృదయాలను ఏలునప్పుడు కష్టములు సంభవింప వచ్చు. యోహాను 15 : 18-20.

## 2. అదొక విమోచన :

ఎ. గలతీ 1 : 3-4; కొలస్స 1 : 13, 14.

బి. మత్తయి 9 : 35.

సి. యేసు మనలను భౌతికంగానే కాదు, ఆత్మీయంగా విమోచించాడు.

## 3. మనమే ఆరాజ్యము :

ఎ. ప్రకటన 1 : 6-9.

బి. మన కీయబడిన గొప్ప విశ్వాసమును, ఘనతను కొన్నిసార్లు మరతుము.

సి. మనము దేవుని ప్రజలము ! దేవుని రాజ్యమైనవారము ! దేవుడు స్థాపించిన రాజ్యము ! క్రీస్తు దానికొరకై తన ప్రాణము పెట్టిన రాజ్యము.

**4. దానిని తప్పించుకొనలేము :**

ఎ. ఫిలిప్పీ 2 : 9-11.

బి. చివరకు ప్రతివాడు యేసును ఒప్పుకొనును. అయితే దానినిబట్టి రాజ్యములో యున్నవారు సంతోషింతురు. ప్రక 7 : 11-17.

**5. అది అదృశ్యమైనది :**

ఎ. యోహాను 18 : 36.

బి. మానవుని హృదయమే దేవుని రాజ్య స్థలము.

సి. లూకా 17 : 20-21. దేవుడు మాత్రమే హృదయ తలంపుల నెరుగును. అదే నిజమైన రాజ్యస్థలము.

**ముగింపు :**

మానవ హృదయాల్లో తరతరములకు జరుగు పరిపాలన దేవుని రాజ్యము. దానిలో ప్రవేశించుట కష్టము, ఆయన సంఘమైన మనమే ఆరాజ్యము. దానిని తప్పించుకొనలేము, అది అదృశ్యమైనది.

— ఎడ్ కర్క్-పేట్రిక్.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**SATYA WAKKU**
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To

........................................

........................................

........................................

........................................